వాసుపల్లికి ప్రజా మద్దతు



దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ నిరంతరం ప్రజలకు సేవ చేస్తూ నిత్యం ప్రజలతో మమేకమయ్యే ఉన్నారు. తన హయాంలో దక్షిణ నియోజకవర్గం **పరిధిలోని 14** వార్డుల్లో దాదాపు రూ. 1,000 **కోట్లతో రహదా**రులు, డ్రెయిన్లు, ఆస్పత్రులు, పార్కులు, స్మార్ట్ బస్ షెల్టర్లు, సామాజిక భవనాలు, కల్యాణ మండపాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్‌జిమ్‌లు, రహదారులు, ప్రధాన కూడళ్ల బ్యూటిఫికేషన్.. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఆయన చేసిన అభివృద్ధి ఇప్పుడు ఆయనను గెలుపు బాట పట్టిస్తున్నాయి. ఎక్కడికెళ్లినా ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఆయనకు జయ జయ ధ్వానాలు పలుకుతున్నారు.

ఫ్యాన్ జోరు.. గ్లాసు బేజారు

- దక్షిణలో వైఎస్సార్‌సీపీ వెంటే స్థానికులు
- అధినేత జగన్ స్ఫూర్తితో ప్రజలతో పార్టీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ మమేకం
- విజయ హారతులతో స్వాగతం
- జనసేనకు ఎదురు గాలి



పిలిస్తే పలికే నాయకుడు వాసుపల్లి. నిరంతరం సేవలు చేస్తూ పేదలకు వెన్నుదన్నుగా నిలిచారు. అతని ప్రత్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రజలతో పెద్దగా కలవరు. పేదలకు సేవ చేసే దృక్పథం కూడా ఆయనలో కానరాదు. దక్షిణ నియోజకవర్గానికి నాన్ లోకల్ కావడం వల్ల అతను అక్కడ ఎదురీదక తప్పదని స్థానికులంటున్నారు.

డాబాగార్డెన్స్ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం ప్రతి లబ్ధిదారుడికి అందేలా దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ నిరంతరం శ్రమించారు. నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా.. అందరినీ అన్నా.. అక్కా.. తమ్ముడు.. బాబాయ్ అంటూ ఆత్మీయంగా పలకరిస్తూ ప్రజలతో మమేకమైపోయారు. సమస్య ఏదైనా నిర్భయంగా చెప్పి స్వాంతన పొందేలా స్థానికులతో సాన్నిహిత్యంగా ఉండేవారు. వారంలో ఐదు చోట్ల ప్రజాదర్బార్‌లు ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేవారు. ఏడాదిలో 170 రోజులకు పైగా నియోజకవర్గంలో పర్యటించారు.
ఐదేళ్లలో 850 రోజులకు పైగా ప్రజల మధ్యే ఉన్నారు. నియోజకవర్గ పరిధి 73 సచివాలయాల్లో గడప గడపకు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఏ రాజకీయ నాయకుడు సొంత నిధుల నుంచి సాయం చేసిన దాఖలాల్లేవు. కానీ వాసుపల్లి గణేష్‌కుమార్ మనస్తత్వం వేరు. గత ఐదేళ్లలో కష్టాల్లో ఉన్న వేలాది మంది పేద ప్రజలకు రూ.3 కోట్లకు పైగా తన సొంత డబ్బుతో ఆర్థిక సాయం అందజేశారు. నగరంలోని వివిధ స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి నియోజకవర్గంలో గల పేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీలు ఇప్పించారు. వారి చదువులకు సంబంధించి అన్ని రకాలుగా సహకారం అందించారు.

కలిసొచ్చిన సీఎం జగన్ బస్సు యాత్ర

ఇటీవల సీఎం జగన్ చేపట్టిన సిద్ధం బస్ యాత్ర నియోజకవర్గం మీదుగా సాగింది. ఈ యాత్రలో జగన్ ప్రజలు, పార్టీ కార్యకర్తలను కలిసి ఆప్యాయంగా పలకరించడంతో పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ పెరిగింది. వారు ప్రజల్లోకి దూసుకుపోగలిగారు.

ఆధ్యాత్మిక రంగంలో..

ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మ వారి ఆలయ విస్తీర్ణానికి వాసుపల్లి తన సొంత నిధుల నుంచి స్థలం కొనుగోలు చేసి ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకున్నారు. వినాయకచవితి, దసరా, రంజాన్, క్రిస్మస్ వంటి పండగలకు విరాళాలు అందజేశారు. అయ్యప్ప, భవానీ భక్తులకు అన్న సమారాధనలు నిర్వహించారు.

ముస్లింలకు అండగా..

కోటవీధి ప్రాంతంలో పుట్టి పెరిగిన వాసుపల్లికి ముస్లింలన్నా, వారి మత సాంప్రదాయాలన్నా అమితమైన గౌరవం. రాజకీయంగా ఆయన గెలుపులో ముస్లింల పాత్ర ఆయన ఎప్పటికీ మరచిపోరు. అందుకే ప్రతి శుక్రవారం ముస్లిం ప్రజాదర్బార్ నిర్వహించి వారి సమస్యలు పరిష్కరిస్తూ వస్తున్నారు. 30వ వార్డులో అంగటిదిబ్బ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల అనంతరం రూ.50 కోట్లకు పైగా విలువైన 5 ఎకరాల స్థలం కేటాయింపునకు అడుగులు వేస్తున్నారు. 36వ వార్డులో గల జామియా మసీదు అభివృద్ధికి తన సొంత నిధుల నుంచి రూ.9 లక్షలు అందజేశారు. రూ.కోటి 90 లక్షలు 37వ వార్డు బీచ్‌రోడ్డులో గల శ్మశాన వాటిక అభివృద్ధికి కేటాయించారు.

వంశీకృష్ణ ఎదురీత



దక్షిణ నియోజకవర్గంలో జనసేన తరపున పోటీ చేస్తున్న చెన్నుటోయిన వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రజలకు అందుబాటులో ఉండరు. అతన్ని కలవాలంటే అతని పీయే వద్ద గానీ.. అనుచరుల వద్ద గానీ మొరపె**ట్టుకోవాల్సిందే అం**టారు. స్థానికుడు కాదని సొంత పార్టీ శ్రేణులే లబోదిబోమంటున్నాయి. ఎక్కడో ఉన్న వంశీకృష్ణకు దక్షిణ నియోజకవర్గ సమస్యల పట్ల అవగాహన లేదనేది జనసేన పార్టీలో వారే చెప్పుకుంటున్న నగ్నసత్యం. అందుకు స్థానికుడు కాని వ్యక్తికి టికెట్ ఇస్తే ఏం లాభమంటూ ఆ పార్టీకి చెందిన మహ్మద్ సాధిక్‌తో పాటు పలువురు గతంలో విమర్శించారు. దక్షిణలో ఏరోజు ప్రజలతో మమేకం కాని ఆయన ఓటమి ఖాయమని జోరుగా వినిపిస్తోంది. పార్టీ కేడర్‌లో నిరుత్సాహం ఆవరించింది.

సహకారం కరువు

2019లో వైఎస్సార్‌సీపీ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు తూర్పు అభ్యర్థిగా సీటు కేటాయించింది. అక్కడ అతను టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబుతో పోటీ చేసి ఓడిపోయారు. అయినప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి అతన్ని చిన్నచూపు చూడలేదు. అతని సేవలు ప్రజలకు అందితే మంచిదని ఎమ్మెల్సీ ఇచ్చి సముచిత రీతిన గౌరవించారు. అయితే ఆ విశ్వాసం అతనిలో లేదు. పార్టీ ఆలోచన, నిర్ణయాలను ధిక్కరిస్తూ 2024లో కోరిన చోట ఎమ్మెల్యే సీటు కావాలని భీష్మించుక్కూర్చున్నారు. ఏ ప్రోద్బలంతోనో అమ్మ లాంటి వైఎస్సార్‌సీపీ గుండెలపై గుద్ది జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే దక్షిణలో అతనికి సహకారం లభించటం లేదు. ఎన్నికలు దగ్గర పడటంతో వంశీకృష్ణ ఓటుకు రూ. వెయ్యి చొప్పున ఓటర్లకు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది.

ఎన్నికలకు సర్వం సిద్ధం

'దక్షిణ' రిటర్నింగ్ అధికారి సీతారామ్మూర్తి



రిటర్నింగ్ అధికారి సీతారామ్మూర్తి

డాబాగార్డెన్స్ : ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. నియోజకవర్గంలో ఎటువంటి చర్యలు చేపట్టారు? ఎన్నికలకు సంబంధించి ఎంత మంది సిబ్బందిని తీసుకున్నారు? మొత్తం పోలింగ్ స్టేషన్లు? సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు? పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు? కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య? శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై దక్షిణ నియోజకవర్గ ఎన్నికల అధికారి సీతారామ్మూర్తి 'సాక్షి'తో పలు అంశాలపై చర్చించారు.

సార్వత్రిక ఎన్నికలకు ఏ విధమైన ఏర్పాట్లు చేపడుతున్నారు?

ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ స్టేషన్లకు మెటీరియల్ పంపిస్తున్నాం. అంతా సిద్ధంగా ఉన్నాం.

ఈ ఎన్నికల్లో ఎంత మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు?

నియోజకవర్గంలో 237 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఇందులో ఒక ఆర్వో, ముగ్గురు ఏఆర్వోలు, సిబ్బంది విధులు నిర్వహిస్తారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏ విధమైన ఏర్పాట్లు చేస్తున్నారు?

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాం. భద్రత పటిష్టం చేశాం.

పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు?

దివ్యాంగులకు వీల్‌చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాం. మంచి నీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నాం.

కొత్తగా ఓటర్లుగా చేరిన వారు ఎంతమంది?

నవంబర్ నుంచి గత నెల వరకు 10399 దరఖాస్తులకు ఆమోదం తెలిపాం.

నియోజకవర్గంలో ఎంత మంది ఓటర్లు, పోలింగ్ కేంద్రాలెన్ని?

నియోజకవర్గంలో 2,16,770 మంది ఓటర్లు వుండగా, 237 పోలింగ్ బూత్‌లు వున్నాయి.

శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఏ విధమైన చర్యలు చేపడుతున్నారు?

నియోజకవర్గం పరిధి దుర్గాలమ్మ గుడి జంక్షన్, చావులమదుం జంక్షన్, కోస్టల్ బ్యాటరీ డౌన్‌రోడ్డులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. అలాగే పోలీసుల సంఖ్య పెంచాం.

ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల వినియోగంపై ఏ మేరకు ప్రజలకు అవగాహన కల్పించారు?

నియోజకవర్గం అంతా 16 మంది సెక్టోరల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో అవగాహన కల్పించాం.

నియోజకవర్గంలో ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగిందా? తగ్గిందా?

గత ఎన్నికల్లో 2,09,186 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు 2,16,770 మంది ఓటర్లు వున్నారు.

కొత్త ఓటర్లకు ఏ విధమైన సమాచారం ఇచ్చారు?

నిర్భయంగా, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని చెప్పాం.

రాజకీయ నాయకులకు మీరిచ్చే సూచనలేంటి?

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అభ్యర్థులంతా సహకరించాలి.

ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేసేందుకు సీవిజిల్ అనే యాప్‌ను రూపొందించారు. దీని ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి తగు చర్యలు తీసుకుంటారా?

కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు చేపడతాం.

పోలింగ్ సమయం?

ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు

మొత్తం ఓటర్లు?

మొత్తం ఓటర్లు 2,16,770. వీరిలో పురుషులు 1,06,444, మహిళలు 1,10,293, ట్రాన్స్‌జెండర్లు 33 మంది ఉన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించారా?

దక్షిణ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో 40 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. అక్కడ భద్రతా చర్యలు చేపట్టాం. పోలీసుల సంఖ్య పెంచాం. వెబ్ కాస్టింగ్, కెమెరాలు ఏర్పాటు చేశాం. పోలింగ్ మొదలు కావడానికి ముందు నుంచి ఈ ప్రాంతాలు నిఘా నీడలో ఉంటాయి. అనుమానితుల కదలికల దృష్టి ఉంటుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అల్లర్లు సృష్టించినా అదుపులోకి తీసుకుంటాం.

ఓటు వేయాలంటే ఏ గుర్తింపు కార్డులుండాలి?

ఓటు వేసేందుకు వెళ్లే ప్రజలు తమ ఓటు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, సర్వీస్ ఐడీ కార్డు (ప్రభుత్వం జారీ చేసినది), పాస్‌ఫొటోతో కూడిన పాస్‌బుక్ (బ్యాంకు పాస్‌బుక్), పాన్ కార్డు, ఆధార్‌కార్డు.. తదితర 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపి తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఓటర్లు తమతో పాటు సాధారణ ఓటర్ స్లిప్ తీసుకెళ్లినా పై గుర్తింపు కార్డులు కూడా తీసుకెళ్తే మంచిది.

గెలుపు పక్కా.. ఇదీ దక్షిణం లెక్క

అభిమానం గుండెల్లో నుంచి రావాలి.. గద్దిస్తే కాదు. శనివారం దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ రోడ్‌షో సందర్భంగా ప్రజల స్పందన చూస్తుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పైన.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పైన, వాసుపల్లి పైన ప్రజలకు ఎంతటి ప్రేమాభిమానాలు ఉన్నాయో అర్థమయింది. రోడ్‌షో సందర్భంగా చిరు వ్యాపారులు, మహిళలు, వృద్ధులు అంతా తమంతట తాము వాసుపల్లిని తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. అభివాదం చేస్తూ అభిమానం ప్రకటించారు. ఇక ప్రచారంలో అయితే మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. జై జగన్.. అంటూ నినదించారు.



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



రెల్లివీధిలో ప్రచారం చేస్తున్న వాసుపల్లి

- ప్రజల దీవెనలతో మళ్లీ జగనన్న రాజ్యమే
- ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్
- దద్దరిల్లిన రోడ్ షో..

డాబాగార్డెన్స్ : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజు శనివారం వైఎస్సార్‌సీపీ దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ చేపట్టిన రోడ్ షో దద్దరిల్లింది. ఏవీఎన్ కళాశాల వద్ద ప్రారంభమైన రోడ్ షో రెల్లివీధి, కలెక్టర్ ఆఫీస్, కేజీహెచ్ డౌన్, లేపాక్షి జంక్షన్, టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి, రామకృష్ణా థియేటర్, కొబ్బరితోట, కెప్టెన్ రామారావు జంక్షన్, అల్లిపురం మెయిన్‌రోడ్డు మీదుగా జ్ఞానాపురం, రైల్వేస్టేషన్ రోడ్డు, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన అశోక్‌నగర్, వాసుపల్లి కార్యాలయం వరకు భారీగా సాగింది. యువత బైక్ ర్యాలీతో సందడి చేశారు. ఈ సందర్భంగా రోడ్డు షో పొడవునా ప్రజలు ఆశీర్వచనాలు అందజేస్తూ అభివాదాలు తెలిపారు. నిత్యం ప్రజలతోనే ఉండి వారికి అండగా నిలబడే వాసుపల్లి గెలుపునకు ప్రజలు ఫ్యాన్ గుర్తు చూపిస్తూ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రచారం చేశామని, జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, తాను ఐదేళ్ల పాటు ప్రజలతోనే ఉండి అందించిన సేవలు తిరిగి ఓటు రూపంలో భారీ మెజార్టీ అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, నియోజకవర్గ పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, మూగి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపీగా బొత్స ఝూన్సీని, ఎమ్మెల్యేగా వాసుపల్లిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రచారానికి అనూహ్య స్పందన..

ప్రచారంలో భాగంగా ఎక్కడికెళ్లినా ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందన, జగనన్నకు పలుకుతున్న నీరాజనాలు, తనపై చూపిస్తున్న అభిమానానికి ఆనందంగా ఉందని దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. దీనికి సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమమే కారణమన్నారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, ఎప్పటిలాగే రాష్ట్రాభివృద్ధికి, పేదల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు.



వాసుపల్లి గణేష్‌కుమార్‌కు అభివాదం చేస్తున్న పెద్దాయన



మద్దతు తెలుపుతున్న వ్యాపారి



వాసుపల్లి రోడ్‌షోని తన ఫోన్‌లో బంధిస్తున్న తాటి ముంజుల వ్యాపారి



వాసుపల్లిని తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న మహిళ

అంతా సైలెన్స్

- ప్రచారాలకు తెర
- మౌనం దాల్చిన మైకులు

డాబాగార్డెన్స్ : మైకుల హోరు.. ఇంటింటి ప్రచారం.. పాటల సందడి సద్దుమణిగింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రచార ఘట్టానికి తెరపడింది. ఎన్నికల నియమావళి ప్రకారం శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రచారాలకు స్వస్తి చెప్పారు. పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు మద్యం దుకాణాలను రెండు రోజుల పాటు మూసివేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

ముగిసిన అభ్యర్థుల ప్రచారాలు..

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ చివరిరోజు శనివారం పెద్ద ఎత్తున రోడ్‌షో నిర్వహించారు. జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ఎల్‌ఐసీ అంబేద్కర్ విగ్రహం నుంచి డాబాగార్డెన్స్, జగదాంబ జంక్షన్ తదితర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించి తిరిగి ఎల్‌ఐసీ అంబేద్కర్ విగ్రహం వద్ద ముగించారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేనలది అపవిత్ర కలయిక

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం : రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలది అపవిత్ర కలయిక అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నోసార్లు మోదీని విమర్శించిన చంద్రబాబు అవకాశవాదంతో బీజేపీతో కలిసారన్నారు. కేజ్రీవాల్‌కు బెయిల్ రావటం మోదీకి చెంపపెట్టన్నారు. ఈ ఎన్నికల్లో ధన రాజకీయాలు అధికం కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం విపరీతంగా డబ్బులు పంచారన్నారు. ఇక్కడ పోటీ చేస్తున్న సీపీఐ మాత్రం ఏడు కరపత్రాలను ప్రతి గుమ్మానికి అందజేసిందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, పార్టీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం : వైశాఖ మాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని బల్లిగిరికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనాలకు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ ఏడాది మొదటి మామిడి పండ్లను భక్తులు స్వామివారికి భారీ ఎత్తున సమర్పించుకున్నారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి వారికి వివిధ హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విలువైన ఓటును విజేతగా నిలపండి

మహారాణిపేట : వీ హెల్త్ కేర్ ఓటర్లను చైతన్యపరిచేందుకు చేపట్టిన వినూత్న కార్యక్రమం అందర్నీ ఆకట్టుకుంటోంది. సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ×సరైన అభ్యర్థిని ఎంపిక చేసుకుందాం.. మన విలువైన ఓటును విజేతగా నిలుపుదాం✓అనే నినాదంతో మధురానగర్ కూడలిలో ఏర్పాటు చేసిన హోర్డింగు అందర్నీ ఆలోచింపజేస్తోంది. వీ హెల్త్ కేర్ చీఫ్ మేనేజర్ చిన్నం కృష్ణ ఈ హోర్డింగు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకునే చైతన్యం కల్పించాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతకు వీ ఫామిలీ హెల్త్ కార్డ్‌ను ఉచితంగా అందిస్తామని చిన్నం కృష్ణ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోరుతూ డాక్టర్ ప్రచారం



ప్రచారం చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ శనివారం 39వ వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల గురించి వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో శారదా మండలి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారులకు టీకాలు వేస్తున్న కొబ్బరితోట వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో శనివారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయాల పరిధిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు, కోరింత దగ్గు, హెపటైటిస్-బి వంటి వ్యాధి నిరోధక టీకాలు వేసి, గర్భిణులకు కింకారీ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి, ఆశ వర్కర్లు లీలావతి, అనురాధ పాల్గొని సేవలు అందించారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు ఘన నివాళి



నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : సమాజ సేవకురాలు, నర్స్ ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని కేజీహెచ్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసీ, చీఫ్ డైటీషియన్ హెచ్. రమణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనా మౌళి, హెడ్ నర్సులు డి.లక్ష్మి, పి.వరలక్ష్మి, ప్రశాంతి, ఉషారాణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.